సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
epaper.manachourasta.com

# మన చౌరాస్తా
The Complete News way

సంపుటి : 02 | సంచిక : 97 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 06.08.2025



మృణాల్ ప్రేమలో

## ధనుష్

- ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న రూమర్స్

4 లో



అది.. కక్ష సాధింపు

# 'కమిషన్'

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
- తుమ్మడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు ప్రజెంటేషన్
- జిల్లాల్లో వీక్షించిన నేతలు, కార్యకర్తలు


2 లో



3 లో

హాస్టల్ పరిసరాలు

# పరిశుభ్రంగా ఉండాలి



## యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నమల్లు యాదవ్

**వరంగల్, మన చౌరాస్తా :** అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొంగలు చిన్నమల్లు యాదవ్ ఏకగ్రీవంగా నియామకం అయ్యారు. మంగళవారం లక్ష్మీపురం లోని పండ్ల మార్కెట్ సమీపంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లబోయిన కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరిబోయిన రాజయ్య యాదవ్ నూతన కమిటీని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొంగల చిన్నమల్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేనబోయిన యాదవ్, ఉపాధ్యక్షులుగా రాజబోయిన కుమార్ యాదవ్, గడల రమేష్ యాదవ్, కందుల నరసయ్య యాదవ్, ఆంబోతు రాజు యాదవ్, కార్యదర్శులుగా సాదం సునీల్ యాదవ్, బొల్లబోయిన వీరస్వామి యాదవ్, మాదరబోయిన యాదగిరి యాదవ్, వేల్పుల శ్రీనివాస్ యాదవ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



# అది..కక్ష సాధింపు 'కమిషన్'

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
- తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు ప్రజెంటేషన్
- జిల్లాల్లో వీక్షించిన నేతలు, కార్యకర్తలు



**హైదరాబాద్, మన చౌరాస్తా :** కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండిరచారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్ ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు. ఈ నివేదికలు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనని హరీష్ తేల్చి చెప్పారు.


కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయట పెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమీషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమీషన్లు. రాష్ట్ర మంతా కమీషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఎస్ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే నివేదికలు న్యాయస్థానాలు, ప్రజా క్షేత్రంలో నిలబడవు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టిందని ప్రశ్నించారు.

తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు ఒప్పందం చేసుకొని ఉంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? రెండేళ్లలో దిల్లీకి కమిషన్లు మోశారు.. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏమీ చేయలేదు. వచ్చే మూడేళ్లు కూడా ఈ ప్రభుత్వం చేసేది ఇదే. కాళేశ్వరంను పడావు పెట్టి బనకచర్లకు నీరు పోవాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. ముమ్మాటికీ తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు...ఈ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందని ఓ వైపు అంటారు..మరోవైపు మూసీకి గోదావరి జలాలు తీసుకొస్తామని ఎలా చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు.



## విక్షించిన నేతలు..

కాలేశ్వరం ప్రాజెక్ట్ పై మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎల్ఈడి స్ర్కీన్ ద్వారా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి ఒక వర ప్రధాయిని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్ట్ ను కూలేశ్వరం అంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు బిడుబారిన నేలలతో ఉన్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ వచ్చిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుతో సస్యశామలంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటమి భయంతో బీఆర్ఎస్ పై బురద చల్లే ప్రయత్నం చేస్తోదన్నారు.



మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- **యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో జిల్లా ధర్నా**

**జనగామ, మన చౌరాస్తా :** విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని, ఎన్నికల మ్యానిఫెస్టో ను అమలుపరచాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు చంద్రశేఖర్ రావు , ఎన్ఎన్ రాజు, షరీఫ్, సత్తయ్య అధ్యక్ష వర్గంగా వ్యవహరించి నిర్వహించిన ధర్నా శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన రంజిత్ కుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్ ను రద్దుచేసి, ఓపీఎస్ ను అమలు చేయాలని, 317 జీఓ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ వారివారి సొంత జిల్లాలకు పంపించాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆగస్టు 23న పెద్ద ఎత్తున ఉపాధ్యాయులతో రాష్ట్ర స్థాయి ధర్నా చేస్తామని హెచ్చరించారు ధర్నా అనంతరం నాయకులు జనగామ కలెక్టర్ కార్యాలయ ఏఏవో సరస్వతి ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ బాధ్యులు మడూరి వెంకటేష్, అంకుషావలి, ఇప్ప రాంరెడ్డి, శాడ రవితో పాటు రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస రావు, కుర్రెముల యాదగిరి గౌడ్, కళావతి, మంగు జయ ప్రకాష్, చిక్కుడు శ్రీనివాస్, రాజీ రెడ్డి, వజ్రయ్య, లక్ష్మణ్ జీ, కందుల శ్రీనివాస్, కృష్ణ, బాబయ్య, చొక్కయ్య, శివరాం, అఫ్సర్, శ్రీనివాస్, దూడయ్య, అశోక్ పాల్గొన్నారు.





# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- **వర్షా కాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి**
- **డాక్టర్లు అలర్ట్ గా ఉండాలి**
- **యూరియా అమ్మకం సజావుగా సాగాలి**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, వర్షాకాలం నేపథ్యంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ లోని తెలంగాణ సాంఘిక ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టల్లో సానిటేషన్ నిర్వహణ, అలాగే వంట గదిని పరిశీలించారు. వర్షాకాల నేపథ్యంలో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, వర్షపు నీరు ఎక్కడ ఆగకుండా చూడాలన్నారు. పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలన్నారు. వంటగదిని పరిశీలిస్తూ వంటకు ఉపయోగించే ప్రతి వస్తువు నాణ్యతతో ఉండాలని, తాజా కూరగాయలను మాత్రమే వాడాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం 10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా కష్ట పడాలన్నారు. అనంతరం సీహెచ్‌సీని సందర్శించి ఓపీ రిజిస్టర్, సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఓపీకి వచ్చే ప్రతి పేషెంట్ కి మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా పరీక్షలు చేయాలన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని (పీఏసీఎస్) తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఒకే రైతు గనుక రిపీటెడ్ గా వచ్చినట్లయితే వారిని గుర్తించి డాక్యుమెంట్స్ పరిశీలించి వెరిఫై చేసిన తరువాతనే వారికి యూరియా ఇవ్వాల్సిందిగా సూచించారు. జిల్లాలో యూరియా సరిపడా ఉందని ఎక్కడ కూడా కొరత అనేది లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి, తహసీల్దార్, వైద్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# రేణుక ఎల్లమ్మ గుడిలో పూజలు

**జనగామ, మన చౌరాస్తా:** శ్రావణ మాసం పురస్కరించుకొని జనగామ పట్టణంలో మూడో వార్డు పరిధిలోని బాలాజీ నగర్ లో రేణుక ఎల్లమ్మ తల్లి మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం శ్రావణమాసం సర్వ శుభప్రదమని, లోక కళ్యాణార్థమై మహిళలు సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ కుటుంబ సంక్షేమానికి ప్రతీకగా భావిస్తారు. అనంతరం అమ్మవారిని గాజులతో అలంకరించి గాజుల పూజ, సహస్ర కుంకుమార్చనలు ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి కట్న కానుకలు సమర్పించారు. భక్తి గీతాలతో సహస్ర పారాయణాలతో భజనలతో అలరించారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పసుపు, కుంకుమ, బొట్టు గాజులు పంపిణీ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పరిసర ప్రాంత భక్తులు విచ్చేసి తమ కోరికలు తీరాలని మొక్కుకొని ప్రసాదాలు స్వీకరించారు.



# ఢిల్లీకి చేరుకున్న నేతలు

**జనగామ, మన చౌరాస్తా :** బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ఢిల్లీలో చేపడుతున్న ఆందోళనలో పాల్గొనేందుకు జిల్లా నుంచి బయలు దేరిన నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. జిల్లాకు చెందిన ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభిగౌడ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లను కలిశారు. 6,7వ తేదీల్లో ధర్నా నిర్వహించే ధర్నాలో పాల్గొననున్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **నాణ్యమైన ఆహారాన్ని మెనూ ప్రకారం ఇవ్వాలి**
- **వంటగది పరిశుభ్రంగా ఉంచాలి**
- **అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**

**జాఫర్‌గఢ్, మన చౌరాస్తా :** వర్షాకాలం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన జాఫర్ గఢ్ మండలంలో పర్యటించారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బాలికల వసతి గృహం, తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల రహదారి సౌకర్యాలు ను పరిశీలిస్తూ మూడు విద్యాసంస్థలకు వెళ్లే దారి ఇబ్బంది కరంగా ఉండడాన్ని గుర్తించి, అంతర్గత రహదారుల నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గర్ల్స్ హాస్టళ్లను సందర్శించి వంటగదిని, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. కూరగాయలను పరిశీలించి ఎప్పటికప్పుడు తాజావి తెప్పించుకోవాలన్నారు. గర్ల్స్ హాస్టల్ పరిశుభ్రతను పరిశీలించి ప్రశంసించారు. ప్రతి రోజు ఇలాగే పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



అదనపు కలెక్టర్ వెంట అదనపు డైరెక్టర్ సత్య మూర్తి, జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, మండల విద్యాధికారి రఘునందన్ రెడ్డి, ఇంజనీర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న, గ్రామ పంచాయతీ సిబ్బంది, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ జ్యోతి ఉన్నారు.




# ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..

**జనగామ, మన చౌరాస్తా :** గానుగుపహాడ్, చిటకోడూరు బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సహించమని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బ్రిడ్జిల నిర్మాణం మొదలు ఐయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మరిగడి మాజీ సర్పంచ్ ఎట్టబోయిన శ్రీనివాస్, కురాకుల పెద్దులు, కంతి బాబు, బాల్నే వెంకట్ రాజు, బోడ సత్తయ్య, యాసారపు సంపత్, గోంగళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా
The Complete News way
06.08.2025 బుధవారం

# మృణాల్ ప్రేమలో ధనుష్

## చక్కర్లు కొడుతున్న రూమర్స్

కోలీవుడ్ స్టార్ ధనుష్ ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే ఆయన 'కుబేర' మూవీతో విజయం అందుకున్నాడు. ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇడ్లీ కడై మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. హీరోగా మాత్రమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, సింగర్‌గాను పేరు తెచ్చుకున్న ధనుష్ గురించి ఎప్పుడూ ఏదో ఒక రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ధనుష్ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల పెళ్లి జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ధనుష్ పేరుతో పలు కథనాలు వెలువడుతున్నాయి. ఒకప్పుడు మీనాతో పెళ్లి వార్తలూ అని చక్కర్లు కొట్టాయి. అయితే మీనా వాటిని ఖండిస్తూ, అలాంటి సంబంధమే లేదు, మా పాపను బాధించకండి అంటూ స్పందించారు. ఇప్పుడు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్‌తో ధనుష్ ప్రేమలో ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుష్ ఆమెతో సన్నిహితంగా కనిపించడంపై, వీరిద్దరి మధ్య స్పెషల్ బాండ్ ఉందని టాక్ స్పీడ్‌గా స్ప్రెడ్ అయింది. చేతులు పట్టుకుని మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో లవ్ గాసిప్‌కు బలం చేకూరింది. ఇక మృణాల్ బర్త్ డే రోజే ధనుష్ ముంబైకి ప్రత్యేకంగా విమానంలో వెళ్లడం, మృణాల్, అజయ్ దేవగన్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' స్పెషల్ స్క్రీనింగ్‌కు హాజరవ్వడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. ధనుష్, మృణాల్ గతంలోను జంటగా కనిపించారు. జూలై 3న, రచయిత్రి-నిర్మాత కనికా ధిల్లన్ ధనుష్ తదుపరి చిత్రం 'తేరే ఇష్క్ మే' కోసం ఏర్పాటు- చేసిన పార్టీలో మృణాల్ సందడి చేసింది. కనికా షేర్ చేసిన ఫొటోల్లో మృణాల్, ధనుష్ సినిమా యూనిట్ తో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు ఫోజులివ్వడంతో అప్పటి నుండే వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారన్న రూమర్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ధనుష్ కానీ, మృణాల్ కానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం వీరిద్దరిపై రకరకాల కామెంట్లు- కొనసాగుతున్నాయి.

